క్లుప్తంగా

సస్యరక్షణ చేపట్టాలి



చిక్కాలవలసలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

నరసన్నపేట: ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన వరి పొలాల్లో సస్యరక్షణ చేట్టాలని రైతులకు కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉదయబాబు, రాయ్, కిరణ్‌కుమార్ సూచించారు. మండలంలోని చిక్కాలవలస, మామిడివలసల్లో నీట మునిగిన వరి పొలాలను స్థానిక వ్యవసాయశాఖ ఏడీ ఎల్.వి.మధు, తహసీల్దార్ సత్యనారాయణతో కలిసి బుధవారం పరిశీలించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ యూరియా అధిక మోతాదులో వేయాలని రైతులకు సూచించారు. కుళ్లు తెగుళ్లు రాకుండా తగిన పురుగు మందులు పిచికారీ చేయాలన్నారు. ఏఓ వై.సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు



పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని భాద్రపద మాసం బహుళ ఏకాదశి సందర్భంగా బుధవారం సాయంత్రం తిరువీధి నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. మంగళవాయిద్యాల నడుమ విగ్రహాలను ఊరేగించారు. అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ బూరల్లి శంకర్ బుధవారం ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే పంచాయతీలో అన్ని వార్డుల్లోనూ ప్రాధాన్యత మేరకు రోడ్లు, డ్రైనేజీల పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులు నాణ్యతగా చేపట్టాలని మండల ఇంజినీర్ బగ్గు నర్సింగరావుకు సూచించారు. పతివాడ గిరీశ్వరరావు, తదతరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యోగా పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పొందూరు: శ్రీకాకుళం పట్టణంలోని కోడిరామ్మూర్తి ఇండోర్ స్టేడియంలో డివిజనల్ స్థాయిలో నిర్వహించిన యోగా పోటీల్లో రాపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. అండర్–14 విభాగంలో జామాన కావ్య, కొంచాడ రాజేశ్వరి, అండర్–17 విభాగంలో మెండ రేణుక, పోతురాజు ప్రసన్న ఎంపికైనట్లు హెచ్ఎం శారదాంబ, పీఈటీ పిల్లా రమణమ్మ బుధవారం తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాలి



అధ్యాపకులతో మాట్లాడుతున్న డీవీఈఓ సురేష్

కొత్తూరు: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు నీట్, ఎంసెట్, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాలని డీవీఈఓ ఆర్.సురేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీని బుధవారం తనిఖీ చేశారు. పలు రికార్డులు, తరగతి గదులు, విద్యా బోధన వంటివి పరిశీలించారు. విద్యా ప్రమాణాలను తెలుసుకున్నారు. రానున్న పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల కోసం ఇప్పటినుంచే సాధన చేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ ధనుంజయ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటలకు దూరం

- అభివృద్ధికి నోచుకోని క్రీడా మైదానాలు
- శారీరక దారుఢ్యం, మనోవికాసానికి విద్యార్థులు దూరం
- పట్టించుకోని అధికారులు, పాలకులు



వర్షం వస్తే కొత్తకోట హైస్కూల్ ఆటస్థలం దుస్థితి (ఫైల్)

ఆమదాలవలస నియోజవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, మైదానాల వివరాలు ఇలా..

మండలం	మొత్తం పాఠశాలలు	క్రీడా మైదానాలు లేనివి
ఆమదాలవలస	95	50
బూర్జ	60	40
పొందూరు	65	45
సరుబుజ్జిలి	52	43

సరుబుజ్జిలి: ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు కావాల్సిన మౌలిక వసతులు లేవు. సౌకర్యాల కల్పనలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందింది. పాఠశాలల మైదానాల అభివృద్ధికి భారీ స్థాయిలో నిధులు మంజూరు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ.. ఆచరణలో ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదన్న విషయం స్పష్టమవుతోంది.

క్రీడా మైదానం ఇలా ఉండాలి..

ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక పాఠశాలలకు 1.5 ఎకరాలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు 2 ఎకరాలు, ఉన్నత పాఠశాలకు 4 ఎకరాల ఆట స్థలం ఉండాలి. చాలావరకు పాఠశాలలకు ఆట స్థలాలే లేని పరిస్థితి. ఆమదాలవలస నియోజకవర్గంలోని ఆమదాలవలస, బూర్జ, పొందూరు, సరుబుజ్జిలి మండలాల్లో 207 పాఠశాలలకు 178 పాఠశాలలకు సరైన ఆట స్థలాలు లేవు. సరుబుజ్జిలి మండలంలోని కొండవలస, పాలవలస, పెద్దమతలబుపేట, పొందూరు మండలంలోని రాపాక, దల్లిపేట, వి.ఆర్.గూడెం, మజ్జిలిపేట, బూర్జ మండలంలోని కె.కె.రాజపురం, తోటవాడ, మామిడివలస, గుత్తావల్లి, ఓవిపేట, ఉప్పినివలస, పాలవలస స్కూళ్లకు ఆట స్థలాలు సక్రమంగా లేవు. కొత్తకోట ఉన్నత పాఠశాలకు క్రీడా మైదానం విశాలంగా ఉన్నప్పటికీ వర్షం వచ్చిందంటే నీరుచేరి రాకపోకలకు విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.



అభివృద్ధికి నోచుకోని రొట్టవలస హైస్కూల్ మైదానం



ఆటస్థలం లేని చినవెంకటాపురం ప్రభుత్వ పాఠశాల

మైదానాలు బాగుచేయాలి



మైదానాలు అభివృద్ధి జరగడం లేదు. క్రీడాకారుల్లో ప్రతిభ ఉన్నప్పటికీ ఉన్నత స్థాయిలో చాలామంది విద్యార్థులు రాణించలేకపోతున్నారు. అత్యధికంగా నిధులు మంజూరు చేసి క్రీడా మైదానాలు బాగుచేయాలి. క్రీడల పట్ల ఆసక్తి రోజురోజుకూ సన్నగిల్లుతోంది. ఆటలు ఆడాల్సిన సమయంలో వృథాగా కాలం గడుపుతున్నాం.

– పి.మోహిత్, విద్యార్థి, మతలబుపేట

ఆక్రమణల్లో మైదానాలు..



చాలావరకు పాఠశాలల మైదానాలు ఇతరుల ఆక్రమణలో ఉన్నాయి. దీనివలన ఇరుకైన స్థలాల్లో విద్యార్థులు సర్దుకుపోతున్నారు. పాఠశాలల్లో క్రీడలు పూర్తిస్థాయిలో జరగక పోవడం వలన వారిలో మనోవికాసం సన్నగిల్లుతోంది. అధికారులు దృష్టి సారించాలి.

– పి.మోహనరావు, విద్యార్థి తండ్రి, మతలబుపేట

నివేదికలు పంపిస్తాం



క్రీడా మైదానాల అభివృద్ధి కోసం అన్ని రకాల చర్యలూ తీసుకోవడం జరుగుతుంది. ఉపాధి హామీ ద్వారా ఆట స్థలాలను అభివృద్ధి చేసేందుకు పరిశీలన చేస్తాం. ప్రతిపాదనలు కూడా పంపించడం జరిగింది. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే తదుపరి చర్యలు తీసుకొంటాం.

– డి.బాలరాజు, ఎంఈఓ, సరుబుజ్జిలి

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ సుధాకర్

సారవకోట: ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ బి.సుధాకరరావు హెచ్చరించారు. బుధవారం సారవకోట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 2024–25లో ఉపాధి హామీ పనుల ద్వారా ఖర్చు చేసిన రూ.28.45 కోట్లకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పీడీ మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అక్రమాలను గుర్తించడానికి ప్రతీ ఆర్థిక సంవత్సరంలో జరిగిన మెటీరియల్ పనులు, వేతన రూపంలో చెల్లించిన నిధులకు సంబంధించి సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంట్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆ సొమ్మును సంబంధిత ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు చెలించాల్సి ఉంటుందన్నారు. రూ.3 లక్షల వరకు రికవరీ చేయనున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో ఉన్న ఫీల్డు అసిస్టెంట్లు మహిళలైతే వారి స్థానంలో భర్త, ఇతరులు విధులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మహాలింగి పంచాయతీలో ఐటీడీఏ నిధుల నుంచి నిర్మించిన బీటీ రోడ్డులో రూ.2.85 లక్షలు అదనంగా చెల్లించినట్లు సమాజిక తనిఖీ బృందం గుర్తించిందన్నారు. దీనిపై సంబంధించిన ఇంజినీరింగ్ అధికారులకు రికవరీకి ప్రతిపాదన చేస్తున్నట్లు తెలిపారు. గొర్రిబంద పంచాయతీ అగుతుపురంలో గతంలో నిర్మించిన మినీ గోకులం షెడ్ల నిర్మాణానికి గత ఆర్థిక సంవత్సరంలో ఫీల్డ్ అసిస్టెంట్ భర్త పేరుతో వెండర్ అకౌంట్ క్రియేట్ చేసి నిధులు చెల్లించినట్లు, మరలా ఈ ఆర్థిక సంవత్సరంలో మరో బిల్లు పెట్టినట్లు గుర్తించారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరుగుతుందని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. మహాలింగి పంచాయతీలో వేతనదారుల సంతకాలు, వేలిముద్రలు లేకుండా వేతనాలు చెల్లించినట్లు గుర్తించామని, ఆ సొమ్మును రికవరీ చేస్తున్నట్లు తెలిపారు. పలు పంచాయతీల్లో మస్తర్లలో దిద్దుబాట్లు, పనుల కొలతల్లో తేడాలు, పాత నేమ్ బోర్డులకు రంగులు వేసి మరలా బిల్లులు పెట్టారని గుర్తించడంతో పలువురు ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీకి ప్రతిపాదనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఏపీడీలు పి.రాధ, కె.లోకేష్, జెక్యూసీ కె.గోవిందరావు, హెచ్ఆర్ మేనేజర్ శ్రవణ్ కుమార్, ఎస్ఆర్పీ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలపై అవగాహన

హిరమండలం: పోస్టల్ సేవలను వినియోగించుకోవాలని ఆమదాలవలస సబ్ డివిజన్ ఏఎస్పీ శ్రావణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో పోస్టల్ సేవలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ ప్రీమియంతో హెల్త్ పాలసీ, ప్రమాద బీమా పథకాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ పోస్టల్ అకౌంట్‌ను ఓపెన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ శాఖ అధికారుల, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

పాతపట్నం: పాతపట్నం సీహెచ్‌సీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి దుర్గాసి గణేష్ డిమాండ్ చేశారు. సీహెచ్‌సీ వద్ద పారిశుధ్య కార్మికులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ కనీస వేతనం రూ.18,600 ఇవ్వాలన్నారు. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని వేతనాలు పెంచాలన్నారు. వీక్లీ ఆఫ్, క్యాజువల్ సెలవులు మంజూరు చేయాలన్నారు. కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించలేదు: టీడీపీ ఎంపీటీసీ

కొత్తూరు: మండలంలోని కడుము రోడ్డు పనుల ప్రారంభ కార్యక్రమంలో అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని కడుము టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు వలురౌతు గోవిందరావు ఆవేదన చెందారు. ఈ విషయంపై బుధవారం విలేకర్లతో మాట్లాడారు. రూ.25 లక్షల నిధులతో రోడ్డు పనులకు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు భూమిపూజ చేశారన్నారు. ఈ కార్యక్రమానికి తనకు ఇంజినీరింగ్ అధికారులు ఆహ్వానం పంపలేదని టీడీపీ ఎంపీటీసీ తెలిపారు. ఎమ్మెల్యే, పార్టీ నుంచి కూడా ఎటువంటి ఆహ్వానం రాలేదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధిగా తనకు పిలవకపోవడం సరికాదన్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ పూజలు



సారవకోట: సారవకోటలో విశ్వకర్మ విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు



నరసన్నపేట: స్వర్ణకారుల భవనంలో విశ్వకర్మ విగ్రహానికి పూజలు చేస్తున్న స్వర్ణకారుల సంఘం ప్రతినిధులు



హిరమండలం: మండల కేంద్రంలో విశ్వకర్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న కామాక్షి స్వర్ణకార సేవా సంఘం సభ్యులు



బూర్జ: లాభాంలో విశ్వకర్మ జయంతిని నిర్వహిస్తున్న భక్తులు

కళలు, చేతివృత్తులు, నిర్మాణాలకు విశ్వకర్మ ఆది గురువుని వక్తలు అన్నారు. ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లో విశ్వకర్మ జయంతిని బుధవారం భక్తిశ్రద్ధతో నిర్వహించారు. పలుచోట్ల విశ్వకర్మ విగ్రహాలను ఏర్పాటు చేసి తిరువీధి, ప్రత్యేక పూజలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: రైల్వే స్టేషన్ ఆవరణలో బంగారు, చేతివృత్తుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి విశ్వకర్మ విగ్రహం



కొత్తూరు: వేంకటేశ్వరాలయం ఆవరణలో కంచి కామాక్షి స్వర్ణకార సంఘం ఏర్పాటు చేసిన విశ్వకర్మ విగ్రహం

ఎరువులు పక్కదారి పట్టాయి

- మండల సమావేశంలో సభ్యుల ధ్వజం



ఎరువుల పంపిణీపై ఏఓను ప్రశ్నిస్తున్న సభ్యుడు

హిరమండలం: మండలానికి వచ్చిన యూరియా, ఎరువులు పక్కదారి పట్టాయని పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎరువులు రైతులుకు సక్రమంగా అందడం లేదని పీఏసీఎస్ అధ్యక్షుడు గొర్లె సింహాచలంతోపాటు పలువురు సభ్యులు ఏఓ బి.సంధ్యను నిలదీశారు. ఎరువుల పంపిణీలో చాలాచోట్ల అవకతవకలు జరిగాయని, ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించారన్నారు. ఇకపై వచ్చే ఎరువులను రైతులుకు సక్రమంగా అందించాలన్నారు. జెడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు మాట్లాడుతూ.. రెవెన్యూలో కొంతమంది అధికారులు సక్రమంగా పనిచేయడం లేదని, మ్యుటేషన్లలో చేతివాటం చూపిస్తున్నారన్నారు. భూమిలేని వారికి కూడా వెబ్‌ల్యాండ్‌లో ఉన్నట్లు చూపించడంతో సంక్షేమ పథకాలు అందుతున్నాయని తహసీల్దార్ ఎ.జోగారావు దృష్టికి తీసుకువచ్చారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతోందని ఎంపీటీసీ మీసాల రజినీ సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం శాఖలవారీగా సంబంధిత అధికారులు ప్రగతి నివేదలకు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు తూలుగు తిరుపతిరావు, ఏఎంసీ ఛైర్మన్ మామిడి రామకృష్ణ, వైస్ ఎంపీపీలు వంగపల్లి సావిత్రి, సవర వైకుంఠరావు, ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరామర్శ..



సరుబుజ్జిలి: నారాయణరావును పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

సరుబుజ్జిలి: మండలంలోని కూనజమ్మన్నపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త యండ నారాయణరావు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందారు. ఆయనను వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ బుధవారం పరామర్శించారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పరామర్శలు చేశారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, విజయరాంపురం సర్పంచ్ బెండి అప్పలనాయుడు, డకరవలస సర్పంచ్ సురవరపు తిరుపతిరావు, కార్యకర్తలు ఉన్నారు.

పలు కుటుంబాలకు..

పొందూరు: మండలంలోని తాడివలస గ్రామంలో ఇటీవల మృతి చెందినవారి కుటుంబాలను చింతాడ రవికుమార్ పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చింతాడ సత్యప్రసాద్, బొడ్డేపల్లి రమణ, వాసుదేవరావు, పోలయ్య, తదితరులు ఉన్నారు.

అవగాహన ర్యాలీ



సర్వేపల్లి విగ్రహాన్ని శుభ్రపరుస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

ఆమదాలవలస: సామాజిక సేవ, సమాజ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ జేడీ (బాలురు), జేడబ్ల్యూ (బాలికలు) సబ్ యూనిట్ క్యాడెట్లు పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని జూనియర్ కళాశాల వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం, మున్సిపల్ కార్యాలయ రహదారి వద్ద ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని, పలువురు జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. 14వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ (శ్రీకాకుళం) ఆదేశాల మేరకు పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పైల రవికుమార్ తెలిపారు. ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ పి.మోహన్‌రావు, సెకండ్ ఆఫీసర్ బి.శరత్‌కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రీమియం కట్టినా వైద్య సేవలు అందించరా?

- ఏపీ ఎస్టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందనరావు



మాట్లాడుతున్న చందనరావు

పోలాకి: ప్రీమియం చెల్లిస్తున్నప్పటికీ వైద్య సేవలు అందించరా అని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం కోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సంఘ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. ఆస్పత్రుల్లో 2017 నుంచి ఉండిపోయిన రూ.50 వేల సీలింగ్‌ను రూ.లక్షకు పెంచాలని డిమాండ్ చేశారు. యాప్‌ల భారం, అసైన్‌మెంట్ పుస్తకాల నిర్వహణ ఉపాధ్యాయులకు తలకు మించిన భారంగా మారిందన్నారు. 12వ వేతన సవరణను అమలు చేయాల్సి ఉండగా నేటికీ కమిషన్‌ను నియమించలేదన్నారు. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ వైఖరి ఎంటో అర్థమవుతోందన్నారు. సంఘ నాయకులు బాడాన రాజు, బగాది రామారావు, ఎస్.మురళి, కళావతి, తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



పొందూరు: ఎంపీడీఓకు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

పొందూరు: పొందూరు ఎంపీడీఓగా ఎస్.వాసుదేవరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఆమదాలవలస ఎంపీడీఓ కార్యాలయం ఏఓగా పనిచేసి ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా వాసుదేవరావుకు డిప్యూటీ ఎంపీడీఓ పి.సింహాచలం, పంచాయతీ కార్యదర్శిలు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలుపుతున్నారు.

జలుమూరు ఎంపీడీఓగా చిన్నమ్మడు



జలుమూరు: జలుమూరు ఎంపీడీఓగా బి.చిన్నమ్మడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. సారవకోట ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పని చేసిన ఈమె ఉద్యోగోన్నతిపై జలుమూరు వచ్చారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ఎంపీడీఓకు మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

పాతపట్నం ఎంపీడీఓగా రమణమూర్తి



పాతపట్నం: పాతపట్నం ఎంపీడీఓగా హెచ్.వి.రమణమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కంచిలి ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పని ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ పి.చంద్రకుమారి ఉద్యోగోన్నతిపై ఏపీడీగా విజయనగరం జిల్లా గరివిడి మండలానికి వెళ్లారు. రమణమూర్తికి ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

పాతపట్నం ఎస్ఐగా మధుసూదనరావు



పాతపట్నం: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా కె.మధుసూదనరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం సీసీఎస్ ఎస్ఐగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ బి.లావణ్య శ్రీకాకుళం ఎస్‌బీఐ ఎస్ఐగా (అటాచ్) బదిలీపై వెళ్లారు. ఎస్ఐ మధుసూదనరావుకు పోలీసులు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్ఐగా కె.శ్రీనివాసరావు

హిరమండలం: ఎల్.ఎన్.పేట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)గా కె.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జలుమూరు నుంచి ఇక్కడకు డిప్యుటేషన్‌పై వచ్చారు. ఈయనకు రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు.

దేవీ నవరాత్రులకు అంకురార్పణ

సారవకోట: మండల కేంద్రంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి విగ్రహం ఏర్పాటుకు బుధవారం అంకురార్పణ చేపట్టారు. ఈ సందర్భంగా రుత్వికులు సంతోష్ శర్మ ప్రత్యేక పూజలు చేపట్టి పందిరి రాట వేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.